నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, గురువారం 13 ఫిబ్రవరి 2025 RANGAREDDY

అనంతగిరి అడవిలో చిరుతపులి

చిరుతపులి సంచరిస్తుందన్న హెచ్చరిక ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన అధికారులు

వికారాబాద్, ఫిబ్రవరి 12 : వికారాబాద్ అనంతగిరి అడవిలో చిరుతపులి సంచరిస్తున్నదని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ తెలిపారు. బుధవారం వికారాబాద్ అనంతగిరి అటవీ ప్రాంతంలో ట్యాక్ కెమెరాలు, హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవిలో చిరుతపులి కదలికలను గుర్తించేందుకు 10 ట్యాక్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. పలు చోట్ల చిరుతపులి ఉందని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. అనుమతులు లేకుండా అనంతగిరి అడవిలోకి ప్రవేశించకూడదని ఆదేశాలు జారీ చేశారు.

పంచాయతీ ఎన్నికలకు పరుగు

- ఎప్పుడైనా షెడ్యూల్ వెలువడే అవకాశం
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు
- మండల కేంద్రాలకు తరలిన పోలింగ్ సామగ్రి

మండల కేంద్రాలకు తరలించేందుకు డీపీవో కార్యాలయంలో పోలింగ్ సామగ్రిని సిద్ధం చేస్తున్న సిబ్బంది

రంగారెడ్డి, ఫిబ్రవరి 12 : రంగారెడ్డిజిల్లాలో పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. త్వరలోనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నది. అందులో భాగంగానే ఎప్పుడైనా షెడ్యూల్ వెలువడే అవకాశాలున్నాయి. ఇందుకనుగుణంగానే జిల్లా యంత్రాంగం కూడా వడివడిగా అడుగులు వేస్తున్నది. పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన సామగ్రి బుధవారం డీపీవో కార్యాలయం నుంచి మండల పరిషత్‌లకు తరలివెళ్లింది. ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు సంబంధించిన గైడ్‌లైన్స్ పుస్తకాలు, బ్యాలెట్ పేపర్ల సీల్ సామగ్రితో పాటు ఇతర రత్రా సామగ్రి మొత్తం మండల కేంద్రాలకు తరలించారు. త్వరలోనే ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు ఇతర సిబ్బందికి మండలస్థాయిలో శిక్షణ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని 531 గ్రామపంచాయతీలకు సంబంధించి ఎన్నికల సామగ్రి పూర్తిగా అందుబాటులోకి వచ్చింది. రిజర్వేషన్లపై త్వరలోనే ప్రకటన వెలువడే అవకాశాలు కూడా ఉన్నాయి. దీంతో పంచాయతీలకు ఎప్పుడైనా ఎన్నికలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

అవినీతి జోరు.. మారని తీరు..

STOP CORRUPTION

- వరుసగా ఏసీబీకి పట్టుబడుతున్నా మారని కొందరు పోలీసు అధికారుల వైఖరి
- లంచమిస్తేనే జరుగుతున్న పని
- సెటిల్‌మెంట్లకు అడ్డాగా మారిన జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లు
- కొన్ని చోట్ల సంపాదనే లక్ష్యంగా పనిచేస్తున్న పోలీసు అధికారులు
- సివిల్ కేసుల్లో తలదూర్చొద్దని ఉన్నతాధికారుల ఆదేశాలున్నా పట్టించుకోని వైనం
- ఇసుక అక్రమ రవాణాలో కూడా పోలీసుల ప్రమేయముందనే ఆరోపణలు

అవినీతి అధికారులకు చిక్కిన ధారూరు ఎస్సై వేణుగోపాల్‌గౌడ్, డ్రైవర్ బీరప్ప (ఫైల్)

సమాజంలో పోలీసులంటే గౌరవ, మర్యాదలున్నాయి. ప్రజల మాన, ప్రాణాలను రక్షించే పోలీసుల్లో నిజాయితీ, నిబద్ధత కలిగిన వారు చాలా మంది ఉన్నారు. అయితే ఈ రకమైన పోలీసుల కంటే అవినీతి, అక్రమాలకు పాల్పడే పోలీసులే పోలీస్ శాఖలో ఎక్కువయ్యారనే ఆరోపణలున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిలో పోలీస్ శాఖనే కాకుండా అన్ని శాఖల్లో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయి. భూముల ధరలు ఎక్కువగా ఉండి, ఎక్కువగా సంపాదన వచ్చే పోలీస్ స్టేషన్లను ముందే ఎంచుకుంటున్న పోలీసులు సంబంధిత పోలీస్ స్టేషన్లలో పోస్టింగ్ కోసం ప్రజాప్రతినిధులకు రూ.లక్షల్లో డబ్బులిచ్చి వస్తున్నారనే ప్రచారం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో జోరుగా జరుగుతున్నది. పోస్టింగ్ వచ్చేందుకు స్థానిక ప్రజాప్రతినిధులకు ఇస్తున్న డబ్బులను తిరిగి రాబట్టుకునేందుకు ప్రజల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.- వికారాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ)

ఇసుక దందాలోనూ..

జిల్లాలోని యాలాల మండలంలోని కాగ్నా నుంచి ఒక్కటి కాదు, రెండు కాదు ఏకంగా 40 ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఈ ఇసుక దందాలోనూ కొందరు పోలీసుల ప్రమేయం ఉందనే ప్రచారం జోరందుకున్నది. అయితే ఏకంగా పోలీసులే ఈ అక్రమ ఇసుక రవాణాను దగ్గరుండి చూసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3-4 వేల వరకు వసూలు చేస్తున్న పోలీసులు దగ్గరుండి నడిపిస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది. పోలీసులు ఇసుక మాఫియా నుంచి వసూలు చేసే డబ్బులు స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు పోలీసు అధికారులకు అందుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇసుక దందాను అడ్డుకట్ట వేయాల్సిన అధికారులే వెనకుండి నడిపిస్తుండడంతో ప్రతిరోజూ జిల్లాలో ఏదో ఒకచోట అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుబడుతున్నప్పటికీ అక్రమ ఇసుక రవాణాకు మాత్రం అడ్డుకట్ట పడడంలేదు. అక్రమంగా ఇసుక తరలింపుపై నిఘా పెట్టి అడ్డుకోవాల్సిన పోలీస్ అధికారులు ఇసుక మాఫియా ఇచ్చే మామూళ్లతో చూసీచూడనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డులేకుండా పోయింది. కాగ్నా నది పరీవాహక ప్రాంతంతోపాటు శివసాగర్, తదితర ప్రాంతాల్లో యథేచ్ఛగా అక్రమంగా ఇసుకను తరలించడంతో జిల్లా ఖజానాకు పెద్దఎత్తున నష్టం జరుగుతున్నది.

డిమాండ్‌ను బట్టి రేట్ ఫిక్స్

బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్ : అడ్డగోలుగా దోచుకోవడంపైనే దృష్టి పెట్టిన కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు పోలీసుల పోస్టింగ్‌లకు డిమాండ్‌ను బట్టి రేట్ ఫిక్స్ చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. పోలీసు శాఖలో జోరుగా పైరవీలు నడుస్తున్నాయని, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మాత్రమే పోస్టింగులు నడుస్తున్నాయన్నారు. బదిలీలను సైతం తమ వ్యక్తిగత అవసరాలకు అనుకూలంగా మార్చుకుని వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మా నియోజకవర్గంలో ఒక్క పోలీస్ అధికారి దగ్గర కూడా పోస్టింగ్‌ల కోసం డబ్బులు తీసుకోలేదు కాబట్టి వారి వృత్తి వారు సజావుగా చేసుకున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తీరు మారింది, పోస్టింగ్ రావాలంటే డబ్బులు చెల్లించాల్సిందే.. ఆ భారాన్ని వాళ్లు వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వస్తున్న ప్రజలపై మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అడ్డదారులు తొక్కుతున్న కొందరు పోలీసులు

జిల్లాలో తాజాగా నాగసముందర్ గ్రామంలో డబ్బా ఏర్పాటు విషయంలో ఏర్పడిన పంచాయతీలో ధారూరు ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ రూ.30వేలు లంచం తీసుకుంటూ డ్రైవర్‌తోపాటు ఏసీబీకి పట్టుబడ్డాడు. ఉత్తమ పోలీసుగా అవార్డు పొంది 20 రోజులు కాకముందే సదరు పోలీస్ అధికారి లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరకడం గమనార్హం. రెండు నెలల క్రితం స్టేషన్ ధారూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదైనప్పటికీ కీచక టీచర్ వద్ద రూ.3 లక్షలు తీసుకున్న ఏసీబీకి చిక్కిన ఎస్ఐ రెండు నెలలపాటు నిందితుడిని అదుపులోకి తీసుకోలేదనే ఆరోపణలున్నాయి. సాక్షాత్తు జిల్లా పోలీస్ ఉన్నతాధికారి పలుమార్లు స్వయంగా ఫోన్ చేసి ఆదేశించినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ప్రచారం జరుగుతున్నది. ఇలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడే పోలీసులపై సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజల నుంచి అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. మరోవైపు ఇటీవల ఓ ఎస్ఐ తమ మాట వింటలేరనే కారణంగా కొందరు కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి మరొకరిని తీసుకువచ్చేందుకు బేరసారాలు జరుపుతుండగా, విషయం తెలుసుకున్న సదరు ఎస్ఐ వెంటనే ఎమ్మెల్యేకు డబ్బులు సమర్పించుకోవడంతో బదిలీ ఆగిపోయిందనే ప్రచారం జరుగుతున్నది. ఇలా ప్రజాప్రతినిధులు చెప్పినవారికే పోస్టింగ్ ఇస్తుండడంతో అవినీతి పెరిగిపోయిందనే ఆరోపణలు వస్తున్నాయి.

పోలీస్ శాఖకు మాయని మచ్చగా..

జిల్లాలోని కొన్ని పోలీస్‌స్టేషన్లయితే ఏకంగా సెటిల్‌మెంట్లకు అడ్డాగా మారిపోయాయి. సివిల్ (భూ తగాదాలు) వ్యవహారాల్లో తలదూర్చొద్దంటూ పోలీస్ ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నప్పటికీ కొందరు పోలీసు అధికారులు ఏమాత్రమూ పట్టించుకోకపోవడం గమనార్హం. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో నిత్యం భూ తగాదాలకు సంబంధించి పోలీసు అధికారులు సెటిల్‌మెంట్లు చేస్తూ వసూళ్లకు అడ్డాగా మార్చుకుంటున్నారు. డబ్బు లిచ్చేవారివైపే నిలుస్తూ న్యాయం జరుగుతుందనే నమ్మకంతో వచ్చే పేదలకు అన్యాయం చేస్తూ పోలీస్ శాఖకు మాయని మచ్చగా కొందరు పోలీసు అధికారులు నిలుస్తున్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో కొందరు ఎస్ఐలు, సీఐలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందనే ప్రచారం జరుగుతున్నది. మరోవైపు లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమని, అవినీతికి పాల్పడితే కటకటాలు తప్పవని, ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 9440446140ను సంప్రదించాలని అవినీతి నిరోధక శాఖ అధికారులు సూచిస్తున్నారు.

సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సెలబ్రిటీ క్రికెట్ లీగ్‌కు పటిష్ట బందోబస్తు

రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): సెలబ్రిటీ క్రికెట్ లీగ్-2025 టీ20 మ్యాచ్‌లకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు వెల్లడించారు. పదకొండో సీజన్ సెలబ్రిటీ క్రికెట్ పోటీలు ఈ నెల 14, 15వ తేదీల్లో ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, క్రికెట్ మ్యాచ్ నిర్వాహకులు, ఆయా ప్రభుత్వ విభాగాలతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మ్యాచ్ సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ఆట చూసేందుకు వచ్చే ప్రేక్షకులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.

ఇల్లు అమ్మాలట.. లేకపోతే చంపేస్తాడట..

సిటీబ్యూరో/సైదాబాద్, ఫిబ్రవరి 12(నమస్తే తెలంగాణ) : అపార్ట్‌మెంట్ ఫ్లాట్ అమ్మేయాలంటూ సైదాబాద్‌లోని కరణ్‌బాగ్‌లో నివాసముంటున్న మిర్చి వ్యాపారి ప్రకాశ్‌రెడ్డిని నయీం అనుచరుడుగా చెప్పుకొనే శ్రీహరి అనే వ్యక్తి రెండేండ్లుగా బెదిరిస్తున్నారని ప్రకాశ్‌రెడ్డి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రకాశ్‌రెడ్డి భార్య అనూరాధ బుధవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. తమ ఫ్లాట్ అమ్మాలంటూ శ్రీహరి కుటుంబం ఎన్నిసార్లు బెదిరించినా వినకపోవడంతో ఈ నెల 9న శ్రీహరి తన కుటుంబసభ్యులతో కలిసి ప్రకాశ్‌రెడ్డి ఇంటికి వచ్చి ఆయన కుటుంబంపై దాడి చేశారని ఆమె పేర్కొన్నారు. తాను నయీం అనుచరుడినని, తనకు హత్యలేం కొత్తకాదని, ఇల్లు తనకు అమ్మకుంటే చంపేస్తానని, అట్రాసిటీ కేసులు పెట్టి జైలుకు పంపుతానని బెదిరించినట్లు తెలిపారు. ఒక నెల రోజులు గడువు ఇస్తున్నానని, ఈలోగా ఇల్లు తనకు అమ్మేయాలంటూ బెదిరించి వెళ్లారన్నారు. శ్రీహరి, ఆయన కుమారుడితో తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని అనూరాధ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు శ్రీహరి కొడుకు రాజేంద్రప్రసాద్ కూడా ఈ నెల 11న సైదాబాద్ పోలీసులకు ప్రకాశ్‌రెడ్డి కుటుంబంపై తమను కులం పేరుతో దూషించారని, దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారని, కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సైదాబాద్ పోలీసులు తెలిపారు.

మూసీలో మళ్లీ కూల్చివేతలు

- భయాందోళనలో పరీవాహక ప్రాంత ప్రజలు
- మూసానగర్‌లో జేసీబీతో మొండి గోడల కూల్చివేత
- అడ్డుగా ప్రహరీ కట్టేందుకే ఈ కూల్చివేతలంటున్న ఎమ్మెల్యే బలాల

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/మలక్‌పేట, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : బుల్డోజర్ వచ్చిందంటే చాలు.. మూసీ పరీవాహక ప్రజలు గజగజ వణికిపోతున్నారు. ఏ క్షణాన ఎక్కడ కూల్చివేతలు మొదలవుతాయోనని ఆందోళనపడుతున్నారు. బుధవారం ఉదయం చాదర్‌ఘాట్ పరిధిలో జేసీబీతో కూల్చివేతలు చేపట్టడంతో ఇతర ప్రాంతాల్లోని కాలనీవాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అధికారులు సైతం వీటిపై స్పష్టత ఇవ్వకపోవడంతో అసలు ఏం జరుగుతుందోనని అందరినీ వాకబు చేస్తున్నారు. అయితే గతంలో చేపట్టిన కూల్చివేతలకు సంబంధించి ఇంకా మొండి గోడలు ఉండటంతో బాధితులు తిరిగి తాత్కాలిక నివాసాన్ని ఏర్పాటు చేసుకుంటారనే అనుమానంతో ఈ కూల్చివేతలు చేపట్టారని కొందరు చెబుతున్నారు. కానీ అధికారులు మాత్రం ఈ విషయాన్ని ధ్రువీకరించడం లేదు. దీంతో కూల్చివేతలు మొండి గోడలకే పరిమితం అవుతాయా? అది పూర్తయినా కొత్త నిర్మాణాల వైపునకు వస్తాయా అనే దానిపై అధికారులు పెదవి విప్పడంలేదు.

సర్వే చేసి..

మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అంటేనే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని పరీవాహక ప్రాంత ప్రజల గుండెల్లో రైళ్లు పరుగెడతాయి. ప్రాజెక్టులో భాగంగా గతంలో భారీ ఎత్తున కూల్చివేతలు చేపట్టేందుకు సర్వే చేసి, మూసీ రివర్ బెడ్ పరిధిలో 2,166 నిర్మాణాలు, బఫర్ జోన్‌లో 7,851 నిర్మాణాలతోపాటు 200 వరకు ఓపెన్ స్పేస్ ఉన్నాయని తేల్చారు. ఆ మేరకు చాదర్‌ఘాట్ పరిధిలోని మూసానగర్, ఓల్డ్ మలక్‌పేట పరిధి శంకర్‌నగర్ పరిధిలో సుమారు 150 వరకు కుటుంబాలు నివాసముంటున్న ఇండ్లను కూల్చివేశారు. అంబేద్కర్ హట్స్, సాయిలు హట్స్, అజయ్ హట్స్ ప్రాంతాల్లో 109 వరకు గుడిసెలను గుర్తించారు. వీటిల్లో 26 వరకు గుడిసెలను కూల్చివేశారు. ఆ సందర్భంగా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతోపాటు బీఆర్ఎస్ కూడా కూల్చివేతలను వ్యతిరేకించి.. బాధితులకు అండగా నిలిచింది. దీంతో ప్రభుత్వం కూల్చివేతల ప్రక్రియను నిలిపివేసింది. బాధితులకు చంచల్‌గూడ పిల్లి గుడిసెలు, వనస్థలిపురం, ప్రతాప సింగారం, జియాగూడ ప్రాంతాల్లో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతానికి కూల్చివేతలు నిలిచిపోయాయని పరీవాహక ప్రాంత ప్రజలు కాస్త కుదుటపడ్డా... ఏ క్షణాన బుల్డోజర్లు వస్తాయోనన్న భయం మాత్రం ఉన్నది.

ఆగుతాయా? కొనసాగుతాయా?

చాదర్‌ఘాట్ పరిధిలోని మూసానగర్‌లోకి అధికారులు బుధవారం జేసీబీతో సహా వచ్చి కూల్చివేతలు మొదలుపెట్టారు. దీంతో మళ్లీ మూసీ పరీవాహకంలో కూల్చివేతలు మొదలయ్యాయంటూ మీడియా, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. దీంతో పరీవాహక ప్రాంత ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. చాలామంది తమ పనులు వదులుకొని ఇండ్ల వద్దకు వచ్చారు. మూసానగర్‌లో గతంలో కొంతమేర కూల్చివేయగా మిగిలిన మొండిగోడలు, శిథిలమైన నిర్మాణాలను పూర్తిగా కూల్చివేసే పనులు మొదలుపెట్టారు. కొంతసేపటికి జేసీబీలో సాంకేతిక సమస్యతో పనులు నిలిపివేశారు. అయినప్పటికీ కూల్చివేతలను ఇంకా కొనసాగిస్తారా? గతంలో కూల్చివేసిన వాటికే పరిమితం చేస్తారా? అనే దానిపై అటు రెవెన్యూ.. ఇటు ఎంఆర్‌డీసీఎల్ అధికారులు నోరు విప్పడం లేదు. కాగా దీనిపై 'నమస్తే తెలంగాణ' మలక్‌పేట ఎమ్మెల్యే బలాలను సంప్రదించగా.. గతంలో అసంపూర్తిగా కూల్చివేసిన వాటిని పూర్తిగా తొలగించి, శిథిలాలను అక్కడి నుంచి తొలగించేందుకు ఈ పనులు చేపడుతున్నట్లు చెబుతున్నారు. తదుపరి ఆక్రమణలకు గురికాకుండా ఉండటంతో పాటు ఇతర కాలనీవాసులకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌డీసీఎల్ అధికారులను తాను కోరానని.. ఈ క్రమంలో రూ.3.60 కోట్లతో ఈ పనులు పూర్తి చేయడంతో పాటు అడ్డుగా గోడ కట్టనున్నట్లు చెప్పారు. బఫర్ జోన్‌లోని నిర్మాణాలను కూడా తొలగిస్తామని ప్రభుత్వం అంటున్నది. ఎమ్మెల్యే బలాల చెబుతున్నట్లు రివర్ బెడ్ వరకు అడ్డుగా గోడ కడితే తదుపరి బఫర్ జోన్‌ను ఎలా స్వాధీనం చేసుకుంటారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

మున్సిపాలిటీల విలీనంతో పదవులకు భారీ గండి..!

ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో పెరుగనున్న రాజకీయ నిరుద్యోగులు

- ఇప్పటికే మున్సిపాలిటీల్లో కలిసిన 25 ఎంపీటీసీలు
- గ్రేటర్ హైదరాబాద్‌లో కలువనున్న 9 మున్సిపాలిటీలు

రంగారెడ్డి, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ నిర్ణయాలతో రంగారెడ్డి జిల్లా స్వరూపం రోజురోజుకూ మారుతున్నది. జిల్లాలో జరుగుతున్న సమీకరణలతో రాజకీయ నిరుద్యోగుల సంఖ్య పెరుగనుంది. ఓ వైపు మున్సిపాలిటీల పెంపు కారణంగా ఎంపీటీసీలు, సర్పంచ్‌ల సంఖ్య ఇప్పటికే గణనీయంగా తగ్గింది. ఔటర్‌కు లోపలున్న మున్సిపాలిటీలను కూడా గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేసే ప్రక్రియ కొనసాగుతున్నది. దీంతో జిల్లాలోని 9 మున్సిపాలిటీలు గ్రేటర్ హైదరాబాద్‌లో కలువనున్నాయి. ఈ 9 మున్సిపాలిటీల్లో ప్రస్తుతమున్న 163 కౌన్సిలర్ పదవులు చేజారిపోనున్నాయి. వచ్చే ఎన్నికల్లో కౌన్సిలర్‌గా పోటీ చేయాలనుకునే వారందరికీ ప్రభుత్వ నిర్ణయం వారి ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది. ఈసారి సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకునే 25 ఎంపీటీసీలు మున్సిపాలిటీలో కలిసాయి. దీంతో ఆయా గ్రామాల్లో ఎంపీటీసీ, సర్పంచ్‌గా పోటీచేయాలనుకునే వారు నిరాశకు గురయ్యారు. ఇప్పటికే ఔటర్ లోపలి మున్సిపాలిటీల్లో భాగంగా పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో తారామతిపేట, బాచారం, కుత్బుల్లాపూర్ వంటి గ్రామాలను., శంకర్‌పల్లి మండలంలోని జన్వాడ గ్రామాన్ని విలీనం చేశారు. దీంతో జిల్లాలో గ్రామపంచాయతీలు, ఎంపీటీసీలు గణనీయంగా తగ్గాయి. జిల్లావ్యాప్తంగా ఉన్న 13 మున్సిపాలిటీల్లో 9 మున్సిపాలిటీలు హైదరాబాద్ మహానగరంలో కలిసే అవకాశాలున్నాయి. దీంతో ఒక్కొక్క మున్సిపాలిటీలో ముగ్గురు నుంచి ఐదుగురికి మాత్రమే కార్పొరేటర్లుగా పోటీచేసే అవకాశాలున్నాయి.

తగ్గిన గ్రామపంచాయతీలు, ఎంపీటీసీలు

జిల్లాలో 549 గ్రామపంచాయతీలుండేవి. ఇటీవల ఔటర్ లోపలి మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాలతో పాటు చేవెళ్ల, మొయినాబాద్ మండలాలను మున్సిపాలిటీలుగా మార్చడం వలన 531 గ్రామపంచాయతీలు మాత్రమే అయ్యాయి. దీంతో 18 గ్రామపంచాయతీలు తగ్గగా 25 ఎంపీటీసీ స్థానాలను కోల్పోవాల్సి వచ్చింది.

విలీనాలపై పెరుగుతున్న ధిక్కార స్వరం

నగరపాలక సంస్థలో గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల విలీనాలపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతున్నది. ఇప్పటికే చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీల్లో గ్రామపంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేయవద్దంటూ ఆయా గ్రామాల ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదులు కూడా చేశారు. మున్సిపాలిటీల్లో విలీనం చేయడం వలన తమ గ్రామాలకు స్వయంప్రతిపత్తి ఉండదని, టాక్స్‌లు కూడా పెరిగే అవకాశాలున్నాయని, మున్సిపాలిటీల్లో చేర్చే విషయాన్ని మినహాయించాలంటూ కోరుతున్నారు. అలాగే, మున్సిపాలిటీలను నగరపాలక సంస్థలో విలీనం చేసే అంశంపై కూడా ప్రజల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపాలిటీలను విలీనం చేయడం వలన లాభాల కంటే నష్టాలే అధికంగా ఉంటాయని ప్రజలు వాపోతున్నారు. దీంతో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనని మున్సిపాలిటీల ప్రజలు ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనమయ్యే మున్సిపాలిటీలు

గ్రేటర్ హైదరాబాద్‌లో ఔటర్ లోపలి మున్సిపాలిటీలను విలీనం చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. జిల్లాలో 15 మున్సిపాలిటీలుండగా.. 9 మున్సిపాలిటీలు ఔటర్ లోపలే ఉన్నాయి. ఇందులో పెద్దఅంబర్‌పేట్, తుర్కయాంజాల్, ఆదిబట్ల, తుక్కుగూడ, శంషాబాద్, రాజేంద్రనగర్, బండ్లగూడ, మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలున్నాయి. ఈ మున్సిపాలిటీలన్నీ ఔటర్ లోపలే ఉండటం వలన వీటిని గ్రేటర్ హైదరాబాద్‌లో కలిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇప్పటికే రాజేంద్రనగర్‌లో ఉన్న 24 వార్డులను గ్రేటర్ హైదరాబాద్‌లో కలిసి ఐదు డివిజన్లుగా విభజించారు. ఇదే ప్రాతిపదికన మిగిలిన మున్సిపాలిటీలను కూడా కార్పొరేషన్లుగా ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి.

మున్సిపాలిటీ పేరు	కౌన్సిలర్లు
పెద్దఅంబర్‌పేట్	24
తుర్కయాంజాల్	24
ఆదిబట్ల	15
తుక్కుగూడ	15
శంషాబాద్	25
బండ్లగూడ	22
మణికొండ	20
నార్సింగి	18